క్లుప్తంగా

మొరం టిప్పర్ స్వాధీనం



ఐనవోలు: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్న సంఘటన మండలంలోని వనమాలకనపర్తి శివారులో చోటు చేసుకుంది. ఎస్సై గైకాడి అనిల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం వనమాల కనపర్తి శివారులో తనిఖీలు చేపట్టగా ఎలాంటి అనుమతులు లేకుండా మొరం తరలిస్తున్న టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నారు. వాహన యజమాని శివరాత్రి శ్రీకాంత్, డ్రైవర్ లక్ష్మణ్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అగ్రంపహాడ్‌లో ముందస్తు మొక్కులు



ఆత్మకూరు: మండలంలోని అగ్రంపహాడ్ సమ్మక్క–సారలమ్మ జాతరలో ఆదివారం భక్తులు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క– సారలమ్మ తల్లులకు ఎత్తు బంగారాలు సమర్పించుకున్నారు. తల్లులారా దీవించండంటూ వేడుకున్నారు.

పూర్వ విద్యార్థుల చేయూత



శాయంపేట : మండల కేంద్రానికి చెందిన మారేపల్లి చంద్రమౌళి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. చంద్రమౌళి కుమారుడు రాజుతో చదువుకున్న 1997–98వ పదోతరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం చంద్రమౌళి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి క్వింటా బియ్యం అందించారు. పూర్వ విద్యార్థులు రంగు వినోద్, బత్తుల రవి, కొత్తపల్లి రవి, రవీందర్, సుధాకర్, రాజేందర్, దైనంపల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపుపై టాస్క్‌ఫోర్స్ దాడి



సంగెం : మండలంలోని గవిచర్ల గ్రామంలో మహ్మద్ రఫీక్ నిర్వహిస్తున్న బెల్ట్‌షాపుపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఏఈసీ మధుసూదన్ వివరాలు వెల్లడించారు. శనివారం రాత్రి దాడి చేసి రూ.6,280 విలువైన మద్యం స్వాధీనం చేసుకునట్టు తెలిపారు. తదుపరి చర్యల కోసం స్థానిక పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ పెండ్యాల దేవేందర్, ఎస్సై నాసర్ తదితరులు పాల్గొన్నారు.

గుడుంబా తయారీ కేంద్రంపై..

సంగెం : మండలంలోని పల్లారుగూడలోని నిషేధిత గుడుంబా తయారీ కేంద్రంపై పోలీసులు ఆదివారం దాడి చేశారు. ఈ సందర్భంగా ఏఎస్సై సీతారాములు వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన రాయపురం సమ్మక్క పల్లారుగూడ శివారులో గుడుంబా తయారీ చేస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసినట్లు తెలిపారు. గుడుంబా తయారీకి ఉపయోగించే 50 లీటర్ల బెల్లం పానకాన్ని, సామగ్రిని ధ్వంసం చేసి 5 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకుని నిందితురాలిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. దాడిలో కానిస్టేబుల్ సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

శుభ్రమైన ఆహారమే తీసుకోవాలి

ఖిలా వరంగల్: రోగాల బారిన పడకుండా ప్రజలు నిత్యం శుభ్రమైన ఆహారం తినడం అలవాటు చేసుకోవాలని ఆడెపు ఓవర్సీస్ కన్సల్టెన్సీ సీఈఓ ఆడెపు మధుసూదన్, బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్ ఆడెపు వెంకటేష్ సూచించారు. ప్రపంచ క్యాన్సర్ నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఖిలా వరంగల్ వాకింగ్, క్రీడా మైదానం నుంచి ఖుష్‌మహల్ వరకు ఓవర్సీస్ కన్సల్టెన్సీ ఆధ్వర్యంలో క్యాన్సర్ నిర్మూలనపై ఆదివారం 2కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వయస్సుతో సంబంధం లేకుండా ప్రతిఒక్కరూ వ్యాయామం చేయాలని, పరుగెత్తడం, సుచి శుభ్రతతో కూడిన ఆహారం తినాలని, ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలని చెప్పారు. 2కే రన్‌లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు.

దౌర్జన్యానికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలి

- వ్యక్తిగత విషయాన్ని సమావేశంలో ప్రశ్నించడం సమంజసం కాదు
- ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తిరుపతిరెడ్డి

శాయంపేట: మండల పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై చర్చించడానికి జరిగే మండల సర్వసభ్య సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధుల సాక్షిగా వ్యక్తిగత విషయంపై తనను ప్రశ్నిస్తూ, నెట్టివేస్తూ దౌర్జన్యానికి పాల్పడిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీపీ మెతుకు తిరుపతిరెడ్డి అన్నారు. ఎంపీపీ చాంబర్‌లో ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రగతిసింగారం గ్రామానికి చెందిన మెతుకు ఆదిరెడ్డి 2017 భద్రాచలం జిల్లా వర్షశాలలో రూ.3.20 లక్షల మండపం పని తన వద్ద సబ్‌కాంట్రాక్ట్ చేశాడన్నారు. పని పూర్తయి ఐదు నెలలకు బిల్లు రావడంతో చెరువు పని చేస్తానని చెప్పడంతో మిషన్ కాకతీయ పథకంలో పులిగుండాల చెరువు పనులు అప్పజెప్పగా 10 శాతం పనిచేసి వదిలివేసినట్లు తెలిపారు. ఆ పని పూర్తి చేయకపోవడంతో నీటిపారుదల శాఖ అధికారులు నోటీసులు ఇచ్చి, టెండర్ రద్దు చేసి, తన కాంట్రాక్ట్ లైసెన్స్‌ను బ్లాక్ లిస్టులో పెట్టినట్లు తెలిపారు. చెరువులోనాలుగు ఫీట్ల వర్క్ పూర్తి చేయడంతో బిల్లు రికార్డ్ చేయలేదని తెలిపారు. దీంతో ఆదిరెడ్డి అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ గండ్రజ్యోతిల దృష్టికి తీసుకెళ్లగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆదిరెడ్డికి రూ. 5.30 లక్షల చెక్కు ఇచ్చినట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికలు పూర్తయ్యాక లెక్కలు చూడగా రూ. 4.04లక్షల మాత్రమే పనిచేసినట్లు గుర్తించి ఆదిరెడ్డితో మాట్లాడమని సర్పంచ్ భర్త రమణారెడ్డికి చెప్పినట్లు తెలిపారు. ప్రభుత్వం నుంచి బిల్లులు రాకున్నప్పటికి ఒప్పందం మేరకే చెక్కు ఇచ్చానని, ఆదిరెడ్డి అకౌంట్ నంబర్ ఇస్తే, చెక్కు రమణారెడ్డి దగ్గర పెట్టుకుంటే అమౌంట్ అందజేస్తానని తెలిపానని అన్నారు. ఆదిరెడ్డి రమణారెడ్డికి చెక్కు ఇవ్వకపోవడంతో తాను డబ్బులు చెల్లించలేదని, ఆదిరెడ్డి ఎప్పుడు తనను నేరుగా డబ్బులు అడగలేదని అన్నారు. శనివారం ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న సర్వసభ్య సమావేశంలో లావాదేవీలతో సంబంధం లేని వ్యక్తితో ఆదిరెడ్డి, అర్చన దంపతులు వచ్చి దౌర్జన్యంగా ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడడం ప్రభుత్వ నియమ నిబంధనలను ఉల్లంఘించినట్లేనన్నారు. అనధికార వ్యక్తి మండల సభకు చొచ్చుకుని రావడం సమంజసం కాదన్నారు. దౌర్జన్యానికి పాల్పడ్డ వ్యక్తులపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని, అవసరమైతే ఉన్నతాధికారులను కలిసి విన్నవించుకుంటానని అన్నారు. సమావేశంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి, ఉపసర్పంచ్ సుమన్, లక్ష్మారెడ్డి, రమణారెడ్డి, విష్ణు, విజయ్‌కుమార్, సదయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై వాహనాలు నిలపొద్దు



జాతీయ రహదారిపై వ్యాపారులకు సూచనలిస్తున్న ఎస్సై అశోక్

దామెర: మేడారం జాతర సందర్భంగా వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని హైదరాబాద్–భూపాలపట్నం (163) జాతీయరహదారిపై వాహనాలు నిలుపరాదని ఎస్సై కొంక అశోక్ సూచించారు. ఈ మేరకు జాతీయ రహదారిపై ఎస్సై తమ సిబ్బందితో ఆదివారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడారం సమ్మక్క సారమ్మ జాతర సందర్భంగా రహదారిపై వాహనాల రద్దీ పెరిగిందని అన్నారు. వాహనాలు నిలిపేందుకు వీలుగా ప్రత్యేకంగా పార్కింగ్ ప్రదేశాలు ఏర్పాటు చేశామని వెల్లడించారు. వ్యాపారస్తులు, తోపుడు బండ్లు, మొబైల్ క్యాంటీన్లు రహదారికి దూరంగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జాతరకు వెళ్లే భక్తులు, వాహనదారులు పోలీసులకు సహకరించి రోడ్డు భద్రతా నియమాలు పాటించి, సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరారు. ఏదైనా సమస్య ఎదురైతే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 100కు కాల్ చేయాలని అన్నారు. తనిఖీల్లో ఏఎస్సై రాజు, సిబ్బంది యాకయ్య, అశోక్, రాము, రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న టోర్నమెంట్ నిర్వాహకులు

పరకాల: కాజీపేటలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పరకాలకు చెందిన క్రియేటివ్ కరాటే దూకు చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. స్పారింగ్ కేటగిరిలో కె.సాయితేజ, కె.వర్షిత, ఎస్.మాన్యశ్రీ బంగారు పతకాలు సాధించారు. కటాస్ బాలుర విభాగంలో ఎస్.షన్ముఖ వాచాస్పతి బంగారు పతకం సాధించగా జూనియర్ బాలుర స్పారింగ్‌లో సాయితేజ గ్రాండ్ చాంపియన్ షిప్ సాధించింది. విజేతలను గ్రాండ్‌మాస్టర్ మాడ సంపత్, మాస్టర్ బొట్ల స్వామి, రాజు అభినందించారు.

క్యాన్సర్ వ్యాధిని అరికట్టేందుకు కృషి చేయాలి



విద్యార్థుల సందేహాలు నివృత్తిచేస్తున్న డాక్టర్ అవినాష్

దామెర: క్యాన్సర్ వ్యాధిని అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీనియర్ సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ తిప్పని అవినాష్ తెలిపారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రం సమీపంలోని ప్రతిమ క్యాన్సర్‌ఇనిస్టిట్యూట్‌లో వైద్య బృందంచే ఆదివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి ప్రాణాంతకమని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ప్రారంభదశలో వ్యాధిని గుర్తిస్తే ఆ మహమ్మారి నుంచి బయటపడొచ్చని తెలిపారు. ఫిబ్రవరి 4 నుంచి మార్చి 4 వరకు ప్రతిమ ఆస్పత్రిలో ఉచిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సంవత్సర కాలంలో 80 శాతం మందికి ఉచిత వైద్యం అందించడంతో పాటు ప్రతి నెలా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఆస్పత్రి డైరెక్టర్ డాక్టర్ మద్ది రాహుల్‌నారాయణ్ మాట్లాడుతూ వ్యాధి తీవ్రతను బట్టి కీమో, రేడియేషన్ వంటి పద్ధతుల ద్వారా చికిత్స చే యాల్సి వస్తుందన్నారు. గైనకాలజిస్ట్ డాక్టర్ సుమిత్ర మాట్లాడుతూ మహిళలు అధికశాతం రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార కేన్సర్ల వలన బాధపడుతున్నారని వెల్లడించారు. 40 ఏళ్లు దాటిన మహిళలు క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతి నిధులు డాక్టర్ చంద్రశేఖర్ ఆర్యా, ఆర్.ప్రకాష్, వివిధ ఫార్మసీ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీ టికెట్ కోసం న్యాయవాది దరఖాస్తు



పరకాల: కాంగ్రెస్ పార్టీ తరఫున వరంగల్ ఎంపీ టికెట్ కోసం పరకాల సీనియర్ న్యాయవాది ఒంటేరు రాజమౌళి టీపీసీసీకి, కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీకి దరఖాస్తు చేసుకున్నారు. మాజీ మంత్రి బొచ్చు సమ్మయ్య, మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పనిచేసిన సమయంలో యువజన కాంగ్రెస్ కార్యకర్తగా, న్యాయవాదుల జాక్ చైర్మన్‌గా తెలంగాణ రాష్ట్రసాధన ఉద్యమంలో క్రియాశీలకంగా పనిచేశాడు. తప్పకుండా న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు రాజమౌళి తెలిపారు. మంత్రి కొండా సురేఖ కోసం రేగొండ మండలంలో ఎన్నికల ప్రచారం చేస్తుండగా నక్సలైట్స్ దాడిలో గాయపడి ప్రాణాలతో బయట పడటం జరిగిందన్నారు. పార్టీ కోసం శ్రమిస్తున్న తనకు టికెట్ ఇచ్చి న్యాయం చేయాలని కోరాడు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఒకే వేదికపై పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ లోని ఎస్ఆర్‌కే పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. 1996–97 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన విద్యార్థులు ఒకే వేదికపై కలుసుకొని ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరవేసున్నారు. పాఠాలు బోధించిన గురువులు కోడూరి సరోజన, రామ్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, కృష్ణమూర్తి, రఘు, కిషోర్, రామును శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం ఫొటో గ్యాలరీ ఏర్పాటు చేసి గ్రూప్ ఫొటోలు దిగారు. ఒకే వేదికపై కలుసుకన్న వారంతా రోజంతా సంతోషంగా గడిపారు.

తక్కళ్లపహాడ్ మాజీ పాలకవర్గానికి సన్మానం



తక్కళ్లపహాడ్‌లో సర్పంచ్ రాజేందర్‌ను సన్మానిస్తున్న యూత్ సభ్యులు

దామెర: మండలంలోని తక్కళ్లపహాడ్ మాజీ పాలకవర్గాన్ని ఆదివారం ఘనంగా సన్మానించారు. జీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బింగి రాజేందర్‌తో పాటు వార్డు సభ్యులను శాలువాలతో సత్కరించి పూలమొక్కలు అందజేశారు. అనంతరం రాజేందర్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డితో పాటు ప్రస్తుత ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి సహకారంతో గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేశానని అన్నారు. సహకరించిన గ్రామ ప్రజలకు, అధికారులకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యూత్ నాయకులు కొత్తపెల్లి నాగేందర్, పైండ్ల సాయికృష్ణ, కొత్తపెల్లి అరవింద్, కొత్తపెల్లి సాయి, అఖిల్, జిల్లెపెల్లి చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తేజోత్సవ్

విద్యారణ్యపురి: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అజీజ్‌ఖాన్ అన్నారు. నగరంలోని ములుగు క్రాస్‌రోడ్డు సమీపంలోని కేఎస్ఆర్ గార్డెన్‌లో రామప్ప జూనియర్ కళాశాలలో జూనియర్, సీనియర్ విద్యార్థులకు తేజోత్సవ్ పేరుతో ఫెయిర్ వెల్‌డే వేడుకలను ఆదివారం నిర్వహించారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ అసోసియేషన్ స్టేట్ సెక్రటరీ సారంగపాణి, రామప్ప అకాడమీ చైర్మన్ చంద్రమోహన్ గౌడ్, కళాశాల బాధ్యులు ఐలి నాగేశ్వర్‌రావు, లక్ష్మినారాయణ, డైరెక్టర్లు కరుణాకర్, తేజస్వి, ఫిజికల్ డైరెక్టర్ కమల్, కోఆర్డినేటర్ వినోద్, వైస్ ప్రిన్సిపాల్ తిరుపతి, అధ్యాపకులు మహేష్, అశోక్, విజయ్, మధుబాబు, చలపతి, చిరంజీవి, రాజు, పూర్ణచందర్, అన్నారెడ్డి పాల్గొన్నారు.

పద్మకు డాక్టరేట్

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని తెలుగు విభాగం పరిశోధకురాలు జక్కె పద్మకు యూనివర్సిటీ డాక్టరేట్ ప్రకటించింది. తిక్కన్న మహాభారతం – మౌసల నుంచి స్వర్గరోహణ ప్రావములు, విమర్శనాత్మక పరిశీలన అనే అంశంపై సమర్పించిన పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథానికి పద్మకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి తెలిపారు. ఆ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్ యాదగిరి పర్యవేక్షణలో పద్మ తన పీహెచ్‌డీ పూర్తిచేశారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటా..



నడికూడ : బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఆనంద్ కుమార్

ఆత్మకూరు: బాధిత కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటానని రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ కోఆర్డినేటర్ ఆనంద్‌కుమార్ అన్నారు. మండలంలోని నీరుకుళ్ల గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త గీసబోయిన యాదగిరిగౌడ్ అనారోగ్యంతో మృతిచెందగా ఆయన కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందించారు. పరామర్శించిన వారిలో కాంగ్రెస్ నాయకులు తాళ్లపెల్లి రవి, జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ మార్క కిరణ్‌గౌడ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

నడికూడ: మండలంలోని రామకృష్ణపూర్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు కూస ప్రభాకర్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం సెయింట్ పాల్స్ స్కూల్ అధినేత, కాంగ్రెస్ రాష్ట్ర ఎస్సీ సెల్ కోఆర్డినేటర్, ఆనంద్ కుమార్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపి మనోధైర్యం నింపారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య సంఘాల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న బండా ప్రకాశ్

కాజీపేట అర్బన్: మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల బలోపేతానికి తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా కమిటీలు సమష్టిగా కృషి చేయాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ ముదిరాజ్ తెలిపారు. 31వ డివిజన్‌లోని క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి వరంగల్ జిల్లా చీఫ్ ప్రమోటర్లు, తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు, ముఖ్య నాయకులతో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో నూతన సభ్యత్వాలపై శ్రద్ధ చూపాలని, చీఫ్ ప్రమోటర్లను జిల్లా అధ్యక్షుల స్థాయికి తీర్చిదిద్దేందుకు ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు. ప్రభుత్వ హామీల అమలుకు త్వరలో రాష్ట్ర కమిటీ సమావేశం ఏర్పాటు చేసి ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల చీఫ్ ప్రమోటర్లు, ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ మహాసభలను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న తిరుపతి

విద్యారణ్యపురి: ఖమ్మంలో ఈనెల 11, 12వ తేదీల్లో జరగనున్న తెలంగాణ ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఫ్) రాష్ట్ర మహాసభలు విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నన్నబోయిన తిరుపతి పిలుపునిచ్చారు. హనుమకొండలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. అంతరాలు లేని విద్య ప్రజల హక్కు – ప్రభుత్వ బాధ్యత ప్రధానాంశంగా కామన్ స్కూల్ విద్యా విధానాన్ని అమలు చేయాలనే డిమాండ్‌తో ఈ సభలను నిర్వహించబోతున్నట్లు వివరించారు. నూతన జాతీయ విద్యావిధానం, రాజ్యాంగ విలువలు, ఫాసిజం – బుద్ధిజీవుల పాత్ర, ఆర్థిక సంక్షోభం –అంతర్జాతీయ పరిస్థితులు – ఫలితాలు ప్రభావం అనే అంశాలపై ఓయూ ప్రొఫెసర్ చింతకింది కాశీం, చంద్రన చక్రవర్తి, బుర్ర రమేష్, వేణుగోపాల్, నర్సింహారెడ్డి, ప్రసాద్ వక్తలుగా ప్రసంగిస్తారని తెలిపారు. సమావేశంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రావుల రమేష్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు రఘుపతి, జిల్లా ప్రధాన కార్యదర్శి గొడిశాల సత్యనారాయణ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు బానోతు సేవానాయక్, ప్రధాన కార్యదర్శి గువ్వాడి జగపతిరావు, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రగిరి లక్ష్మయ్య, హనుమకొండ జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి భీమళ్ల సారయ్య, బాధ్యులు భాస్కర్, ఎండీ.సత్తార్ పాల్గొన్నారు.

అడుగడుగున గుంతలు.. నడక నరకప్రాయమే



గుంతలు తేలిన తిమ్మాపూర్–ఎల్గూర్ స్టేషన్ రోడ్డు



తొమ్మిది మోరీల కాజ్‌వేపై ఏర్పడిన గొయ్యి


సంగెం : మండలంలోని తిమ్మాపూర్ నుంచి ఎల్గూర్ స్టేషన్, తూర్పు తండా మీదుగా నెక్కొండ మండలంలోని చంద్రుగూడెం వెళ్లే బీటీ రోడ్డుకు అడుగడుగునా గుంతలు పడి ప్రయాణికులు నడక సాగించడమూ నరకప్రాయంగా తయారైంది. ఈ బీటీ రోడ్డు పూర్తిగా ధ్వంసం అయింది. అడుగడునా గుంతలు తేలి కాలినడక సాగించడమూ కష్టంగానే ఉంది. రోడ్డుపై ఆటోలు, ట్రాలీలు, ట్రాక్టర్లు నడిపే డ్రైవర్లు నడుం దెబ్బతింటోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు ప్రయాణం సాగించాలంటే బెంబేలెత్తుతున్నారు. ఇదిలా ఉండగా తొమ్మిది మోరీల లోలెవల్ కాజ్‌పై గుంత మరింత ప్రమాదకరంగా తయారైంది. అసలే గుంత.. ఆపై మూలమలుపు.. అదమరిస్తే అంతే.. ఆస్పత్రి పాలవడం ఖాయమన్న వ్యాఖ్యలు సర్వసాధారణమైపోయాయి. ఇకనైనా ప్రభుత్వం, సంబంధిత శాఖల ఉన్నతాధికారులు స్పందించి బీటీ రోడ్డును రెన్యూవల్ చేయడంతోపాటు తొమ్మిది మోరీల లోలెవల్ కాజ్‌వేపై ఏర్పడ్డ గుంతను పూడ్చి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సేవాలాల్ జయంతిని సెలవుదినంగా ప్రకటించాలి

హన్మకొండ: సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించడంతో పాటు ఆ రోజును ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని సంత్ శ్రీసేవాలాల్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు బానోత్ నవీన్ నాయక్ కోరారు. హనుమకొండ బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని సంత్ శ్రీసేవాలాల్ ఉత్సవ కమిటీ, లంబాడ హక్కుల పోరాట సమితి నాయకులు ఆదివారం కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించేలా సీఎం ఎనుముల రేవంత్ రెడ్డికి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈనెల 15న హనుమకొండ గిరిజన భవన్‌లో జరగనున్న సేవాలాల్ జయంతి కార్యక్రమానికి రావాలని ఎమ్మెల్యేను ఆహ్వానించారు. కార్యక్రమంలో లంబాడ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోరిక ఈశ్వర్‌సింగ్ నాయక్, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం డీన్ ప్రొఫెసర్ భూక్య బాబురావు నాయక్, పాల్గొన్నారు.

మున్సిపాలిటీల్లో 'ఉపాధి' కల్పించాలి

- డీఎన్ఎస్ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుమారస్వామి



సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి

వర్ధన్నపేట : ప్రస్తుత పార్లమెంటరీ సమావేశాల్లో ఉపాధి హామీ చట్టానికి సవరణ చేసి మున్సిపాలిటీల్లోనూ గ్రామీణ పేదలకు పనులు కల్పించాలని దళిత నిరుద్యోగ సంక్షేమ సంఘం (డీఎన్ఎస్ఎస్) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల కుమారస్వామి డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోనే కాకుండా కూలీలు పట్టణ ప్రాంతాల్లోనూ ఉపాధి లభించక వలస పోతున్న దుస్థితి నెలకొందని చెప్పారు. తెలంగాణ ఏర్పాటు కోసం ఉద్యమించిన వారికి నెలకు రూ.25 వేల భృతి అందించాలని, 250 గజాల స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీల్లో ఉపాధి పనులు కల్పించేలా ఈనెల 9న జరగనున్న బడ్జెట్ సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టి ఆమోదించాలని కోరారు. సమావేశంలో నాయకులు చల్లా మిధున్, బి.బాబు, కొండేటి రాంచంద్రు తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వరంగల్ అర్బన్: ఏళ్ల తరబడి ఔట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేయాలని సంఘం నాయకులు కోరారు. ఈమేరకు వరంగల్ 26వ డివిజన్‌లో మంత్రి కొండా సురేఖకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. పనికి తగిన వేతనాన్ని అందించాలని సూచించారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్, కొత్తకొండ శ్రీనివాస్, కొమ్ము తిలక్, కుమార్, ప్రసాద్, నరేష్, దేవేందర్ తదితరులు ఉన్నారు.